నేడు డయల్ యువర్ డీఎం

బోడుప్పల్: ఆర్టీసీ చెంగిచర్ల డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని, డిపో మేనేజర్ కవిత ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని పలురూట్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వారి సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు 7893088433 నంబరును సంప్రదించాలని కోరారు.

ఆలయ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారోత్సవంలో పరమేశ్వర్‌రెడ్డి

కాప్రా: డివిజన్‌లోని చెన్నకేశ్వరస్వామి ఆలయ ట్రస్టీ బోర్డు సభ్యులు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ట్రస్టీ బోర్డు సభ్యులుగా బాబురావు, మల్లారెడ్డి, సత్యనారాయణ, వినోద్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి హాజరుకాగా.. ఆలయ ఈవో కృష్ణమాచారి, దేవాదాయ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, మాజీ కార్పొరేటర్లు పావనీరెడ్డి, ధన్‌పాల్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేష్, అంజిరెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఇంట్లో చొరబడి..

చోరీకి యత్నించిన దుండగుడు

ఉప్పల్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో ఓ దుండగుడు అర్ధరాత్రి చోరీకి యత్నించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ రాఘవేంద్రకాలనీ, అన్నపూర్ణ కాలనీ, కల్యాణపురి కాలనీలో బుధవారం అర్ధరాత్రి ఓ దుండగుడు ఇళ్లలోకి చొరబడి చోరీకి విఫలయత్నం చేశాడు. ఓ ఇంట్లో నుంచి సైకిల్‌ను దొంగలించి తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డైంది. అతడితో పాటు మరికొంత మంది ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కాలనీల్లో పోలీస్ పెట్రోలింగ్ గస్తీని పెంచుతామని ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి తెలిపారు.

చిన్నారులు అన్ని రంగాల్లో రాణించాలి



గౌతంనగర్: విద్యార్థులు విద్యార్థి దశ నుండే అన్ని రంగాల్లో రాణించాలని కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని న్యూ వేంకటేశ్వరనగర్‌లోని శాంతినికేతన్ పాఠశాలలో కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్‌డేను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పట్టభద్రులై అలరించారు. పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

శాస్త్రీయ నృత్యకారుడికి నివాళి

అల్వాల్: తెలుగు రాష్ట్రాల్లో శాస్త్రీయ నృత్య దిగ్గజం రామాంజనేయులుకు నేరేడ్‌మెట్‌లోని హెలెన్ కెల్లర్స్ స్కూల్‌లో గురువారం వ్యవస్థాపకులు పఠాన్ ఉమ్మార్‌ఖాన్ విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. 15న తిరుపతిలో ఆయన మృతిచెందినట్లు చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

అలంకరణ గోదాంలో అగ్నిప్రమాదం



అల్వాల్: మచ్చబొల్లారంలో అలంకరణ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సాయిరెడ్డి కాలనీ సమీపంలోని శ్మశానవాటిక ప్రహరీగోడను అనుకుని పలు గోదాంలు ఉన్నాయి. వీటిలో వివిధ వేడుకలకు ఉపయోగించే ఫైబర్ అలంకరణ సామగ్రి గోదాం కూడా ఉంది. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా సామగ్రికి మంటలు అంటుకుని ఎగిసిపడ్డాయి. శ్మశానంలోని వ్యర్థాలను తగులబెట్టి ఉండొచ్చని భావించిన స్థానికులు ప్రమాదాన్ని గమనించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రూ. 4 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని అగ్నిమాపక దళం సిబ్బంది తెలిపారు.

భూ భారతితో వివాదాలకు శాశ్వత పరిష్కారం

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీ బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి, నూతన ఆర్‌ఓఆర్ చట్టం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం మేడ్చల్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో భూభారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టంపై తహసీల్దార్లు, జిల్లా రెవెన్యూ అధికారులకు అవగాహన కల్పించేందుకు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. భూభారతి ఆర్‌ఓఆర్ చట్టంలోని అన్ని అంశాలను క్షుణ్ణంగా చదివి పూర్తి అవగాహన చేసుకోవాలన్నారు.

- 1989 ఆర్‌ఓఆర్ చట్టంలోని అంశాలు భూభారతిలోని అంశాలు కొంత వరకు సిమిలర్గా ఉన్నాయన్నారు. రెవెన్యూ అధికారులకు ధరణిలో లేని అధికారాలు భూభారతిలో ఉన్నాయని, ఈ అధికారాలతో రెవెన్యూ అధికారులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.
- ప్రతీది ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ రికార్డులను నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారులకు పూర్తిస్థాయి అధికారాలు వచ్చే వరకు ప్రొసీడింగ్స్ ద్వారా మాన్యువల్‌గా నిర్వహించాలన్నారు.
- నూతన మార్గదర్శకాలతో సమ్మతించడం, తిరస్కరించడం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్‌ఓఆర్ చట్టాన్ని తెచ్చిందన్నారు.
- ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు ఉన్నాయని, ప్రభుత్వం ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూమికి సంబంధించి సర్వేచేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకురాబోతుందని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడిందన్నారు.
- భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వేచేసి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.
- ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల పరిష్కారం ఈ చట్టం ద్వారా వేగవంతం కావడంతో పాటు, వారసత్వ భూముల మ్యూటేషన్‌ను గడువులో పూర్తిచేయడం, హక్కుల సంక్రమణను అధికారికంగా నమోదు చేయడం ద్వారా వ్యవస్థ మరింత నిబద్ధతతో పనిచేస్తుందని కలెక్టర్ తెలిపారు.
- భూ సమస్యల పరిష్కారానికి రెండంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తుందన్నారు.
- ఇళ్ల స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.
- గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను శాస్త్రీయంగా చేస్తూనే, మోసపూరితంగా పొందిన ప్రభుత్వ భూములపై పట్టాలను రద్దు చేసే అధికారం ఈ చట్టం ద్వారా కల్పించబడిందని, భూ భారతి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తోందన్నారు.
- భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టంపై అవగాహనను ఏర్పరచుకోవాలని కలెక్టరు సూచించారు.
- ఈనెల 19 నుంచి జిల్లాలో అవగాహన సదస్సులు ఉంటాయని, ఈ సదస్సుల ద్వారా భూభారతి చట్టంపై ప్రజలు, రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యామ్‌ప్రకాష్, డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు సాంకేతికత అవసరం


మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాసనిపుణులు గంప నాగేశ్వర్‌రావు

మల్లాపూర్: చదువుతో పాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు గంప నాగేశ్వర్‌రావు అన్నారు. పదోతరగతి పూర్తయినా విద్యార్థుల కోసం హబ్సిగూడలోని వ్యాలీ ఓక్ జూనియర్ కళాశాలలో మూడ్రోజుల పాటు నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గంప నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యంతో ముందుకుసాగాలన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్లు ప్రశాంత్‌కుమార్, జగన్మోహనరావులు మాట్లాడారు. వ్యక్తిత్వ వికాసం తరగతులతో పాటు విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌తో పాటు సలహాలు, సూచనలను విద్యార్థులతో పంచుకున్నామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



రామంతాపూర్ : సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంగా మారిందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉప్పల్ రామంతాపూర్‌కు చెందిన సౌజన్యలక్ష్మి, వీరయ్య, మదర్‌భాషలకు మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ సీఎంఆర్ఎఫ్ కింద మెడికల్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు సీఎం రిలీఫ్‌ఫండ్‌ను ఉపయోగించుకుని లబ్ధిపొందాలని ఆయన సూచించారు. పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

రామంతాపూర్ : చిలుకానగర్ డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలు, కాలనీల్లో స్ట్రామ్‌వాటర్ డ్రైయిన్ పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ బన్నాల గీత జెడ్సీ హేమంత్ కేశవ్‌పాటిల్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. నీటి కాల్వలు లేకపోవడం వల్ల వర్షం వచ్చినప్పుడల్లా వరద రోడ్లపై పారుతుందన్నారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు.



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ గీతాప్రవీణ్

లక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న డాక్టర్ మోత్కూరు సత్యనారాయణశాస్త్రి

అల్వాల్: వెంకటాపురం కానాజిగూడలోని మరకత లక్ష్మీగణపతి ఆలయంలో నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. గురువారం రెండోరోజు స్వామివారికి సుప్రభాత సేవ, విశేష అభిషేకం, మూలమంత్ర జపం, మంటప స్థాపిత దేవతా పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులచే లక్ష్మీగణపతి హోమం, లక్ష్మీకుబేరహోమం, లక్ష్మీనారసింహహోమం, సుదర్శన హోమం, చండీహోమం, మృత్యుంజయ, రుద్రహోమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు

బోడుప్పల్: రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు 1వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్ అన్నారు. ద్వారకానగర్ కాలనీ ఫేస్- 1లో గురువారం రూ.50 లక్షలతో సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్, నాయకులు రాసాల కుమార్‌యాదవ్ కాలనీవాసులు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జంగయ్యయాదవ్

పోలీసుల అదుపులో నకిలీ వైద్యుడు


నకిలీ వైద్యుడు బాబీ బికాష్ గోల్దార్

మల్లాపూర్: నకిలీ వైద్యుడిని మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్ మల్లాపూర్‌లో నాగమాత క్లినిక్‌ను నకిలీ వైద్యుడు బాబీ బికాష్ గోల్దార్ (21) నడిపిస్తున్నాడు. స్థానికులు ఇచ్చి ఫిర్యాదు మేరకు ఎస్‌వోటీ పోలీసులు గురువారం క్లినిక్‌ను తనిఖీ చేశారు. నకిలీ ధ్రువపత్రాలతో ఎంబీబీఎస్ డాక్టర్ అవతారం ఎత్తి అమాయక ప్రజలను సేవల పేరిట రోగుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న బాబీ బికాష్ గోల్దార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నాచారం పోలీసులకు అప్పగించారు. క్లినిక్‌లో మందులు, ఇంజక్షన్లు, వైద్య పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

ఉప్పల్: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉప్పల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ జనప్రియకు చెందిన మట్ట సతీష్‌కుమార్ ఒడిశా బార్డర్ నుంచి ఎండు గంజాయిని కొనుగోలు చేసి తీసుకొచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు మల్లాపూర్ శివాలయం వెనకాల ఉన్న మున్సిపల్ గ్రౌండ్‌లో ఉన్న మట్ట సతీష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 1.227 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

బీసీ కులసంఘాలు జేఏసీగా ఏర్పడటం అభినందనీయం


రాజబాబు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

మల్లాపూర్: బీసీ కుల సంఘాలన్నీ కలిసి ఒకే జేఏసీగా ఏర్పడటం అభినందనీయమని బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నేత సాయిజెన్‌శేఖర్ అన్నారు. గురువారం బీసీ సంఘాల జేఏసీ సమావేశంలో కన్వీనర్ రాజబాబును ఘనంగా సత్కరించారు. సలహాదారులు నల్లా రాధాకృష్ణ, కనుకుంట్ల విజయ్‌కుమార్. రామకోటేశ్వర్‌రావు, శ్రీకాంత్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, సాయిబాబా, చంద్రమౌళి, దొంతుల శ్రీనివాస్, గంధం నాగేశ్వర్‌రావు, రాంబాబు తదితరులున్నారు.

గుర్రపుడెక్క తొలగింపు పనుల షురూ

మల్లాపూర్: పటేల్‌కుంట చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులను గురువారం ఎంటామాలజీ సిబ్బంది చేపట్టారు. సోమవారం గుర్రపు డెక్క తొలగించాలని కోరుతూ జోనల్ కమీమిషనర్‌కు కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. గుర్రపుడెక్కను తొలగించి దానిపై కెమికల్ మందును పిచికారి చేశారు. ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహ, బీఆర్ఎస్ నేతలు ముత్యంరెడ్డి, బాలరాజ్, యుసఫ్, శివకుమార్, రాంచందర్, శ్రీనివాస్ తదితరులున్నారు.


గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి


హెచ్‌బీకాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

కుషాయిగూడ: భారతరాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని కాంగ్రెస్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య అన్నారు. జైబాపు, జై భీమ్, జై సంవిధాన్‌లో భాగంగా గురువారం మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్, వేంకటేశ్వరనగర్ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం గొప్పతనం, విశిష్టతను వివరిస్తూ.. ర్యాలీ నిర్వహించారు. మహనీయుల బాటలో నడిచి వారి ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్, ఉదయ్‌కిరణ్, అనిల్‌కుమార్, మల్లేష్, సమ్మయ్య, సురేష్, రమేష్, నరేందర్ జలగం రాజేష్, జానీ, సుధాకర్, శ్రీకాంత్, లాజర్, రాజు, కృష్ణ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో వర్గ పోరు !



కాప్రా: కాంగ్రెస్ మార్క్ రాజకీయానికి ఉప్పల్ నియోజకవర్గం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కష్టకాలంలో పార్టీనే అంటిపెట్టుకుని ఉండి సిద్ధాంతం కోసం పనిచేసిన వారికి తగిన శాస్తే జరిగిందని ఓ వర్గం ఆవేదన వ్యక్తం చేస్తుంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులు కాపాడుకునేందుకు కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి ప్రాధాన్యతనిస్తూ.. పాతవాళ్లను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- నియోజకవర్గంలోని కాప్రా సర్కిల్ కాంగ్రెస్ పార్టీలో గ్రూపు పాలిటిక్స్ పరాకాష్టకు చేరాయి. గత కొంతకాలంగా నివురుగప్పిన నిప్పులా ఉన్న కేడర్ ఇప్పుడు చెన్నకేశ్వరస్వామి ఆలయ ట్రస్టీ బోర్డు ఎంపికతో ఒక్కసారిగా రోడ్డెక్కింది. అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నేతలకు పదవులు కట్టబెట్టి, ఎన్నో ఏళ్ల నుంచి పార్టీనే నమ్ముకున్న తమను మాత్రం దూరంపెట్టారని మండిపడుతున్నారు.
- పార్టీ ప్రతిపక్షంలో ఉండగా పీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి ఏ పిలుపిచ్చినా పార్టీ కోసం పరుగెత్తుకుంటూ కార్యక్రమాలు నిర్వహించామని, అర్ధరాత్రి అపరాత్రి అని తేడా లేకుండా అరెస్టులు, నిర్బంధాలకు ఎదురొడ్డి నిలిస్తే తీరా పార్టీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ పెద్దలు తమను దూరం పెడుతున్నారని వాపోతున్నారు.

'పాతవాళ్లను పాతరేస్తున్నారు..'



కష్టకాలం నుంచి పార్టీనే నమ్ముకుని ఉన్నందుకు తగిన శాస్తి చూపిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ మారిన నేతలకు జాక్‌పాట్ కొట్టినట్లు పదవులు కట్టబెడుతున్నారు. నాడు పార్టీ కోసం జైలు జీవితం గడిపి, కుటుంబానికి దూరమయ్యాం, ఆర్థికంగా దెబ్బతిన్నాం. అయినా పార్టీనే నమ్ముకుని పనిచేశాం. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత తమను పక్కనపెట్టి కనీస గౌరవం కూడా చూపకుండా కొత్తవారికి ప్రాధాన్యతనిచ్చి పదవులు కట్టబెడుతున్నారు.

– శ్రీకాంత్, కాంగ్రెస్ ఎస్సీసెల్ కన్వీనర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కుళ్లిన స్థితిలో మృతదేహం


యాకుబ్ (ఫైల్)

కుషాయిగూడ: అనుమానస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు, మూడు రోజుల క్రితమే చనిపోవడంతో మృతదేహం కుళ్లిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్, ఇప్పగూడెంకు చెందిన బొంకూరు యాకుబ్, మమత దంపతులు 25 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ, నవోదయ నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కాగా భార్యభర్తల మధ్య గొడవల కారణంగా భార్య పిల్లలతో కలిసి వేంకటేశ్వరనగర్ కాలనీలో బట్టల వ్యాపారం చేసుకుంటోంది. భర్త యాకుబ్ కూలీ పనిచేసుకుంటూ నవోదయనగర్‌లోని తన సొంతింట్లో ఒంటరిగా ఉంటున్నాడు. కాగా గురువారం ఉదయం యాకుబ్ ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. కుళ్లిన స్థితిలో యాకుబ్ మృతదేహం లభ్యమైంది. పోలీసులకు కుటుంబసభ్యులు సమాచారం ఇచ్చి ఆధారాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. భర్త మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని భార్య పోలీసులకు తెలిపింది. కాగా మృతుడి తలపై గాయాన్ని బట్టి మద్యం మత్తులో కిందపడిపోయి తలకు గాయమై చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


మచ్చబొల్లారం డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. డివిజన్ పరిధిలోని సారస్‌నగర్ రోడ్డు, రాయల్ ఎన్‌క్లేవ్ తదితర కాలనీలలో ఆయన అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పర్యటించారు. రాయల్ ఎన్‌క్లేవ్ వద్ద వరద నీరు ప్రవహించడం ఇబ్బందిగా ఉందన్నారు. నాలాలలో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. కాలనీలలో విల్లాలు, ప్లాట్‌లు బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని, నిర్మాణ సామగ్రి తెచ్చే భారీ వాహనాలు వస్తుండటంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిందని దీనివల్ల రాకపోకలు సాగించాలంటే తీవ్రంగా ఇబ్బందులు ఎదురౌతున్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ సంబంధిత నిర్మాణదారులైన బిల్డర్‌లతో మాట్లాడి రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. డీఈ రఘు, ఏఈ రవళి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అఫ్రోజ్, సురేందర్‌రెడ్డి, చరణ్, బాలాజీ, కేఎస్ఎన్ మూర్తి, సుబ్బయ్య, రాధా తదితరులున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


చల్ల ప్రభాకర్‌ను సత్కరిస్తున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కుషాయిగూడ: బీజేపీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. బీజేపీ చర్లపల్లి డివిజన్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన చల్ల ప్రభాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై నూతన అధ్యక్షుడిని ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. ఎలాంటి విభేదాలకు తావులేకుండా నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. బీజేపీ నేతలు నాదం, నర్సింగరావు, లక్ష్మణ్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, గణేష్‌ముదిరాజ్, హరినాయక్, బ్రహ్మచారి, రామకృష్ణ, సహదేవ్‌గౌడ్, అప్పి నాయి, పవన్‌కుమార్, జనార్దన్ తదితరులున్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో మాస్టర్ అరుణ్ కార్తీక్



కీసర: 18 దేశాల నుంచి 1,046 మంది సంగీతకారులు కీ బోర్డులో సరలీ-స్వరాస్ ఆడటంతో పాటు ఆన్‌లైన్‌లో ఓ గంటలో అప్‌లోడ్ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో దమ్మాయిగూడకు చెందిన మాస్టర్ అరుణ్ కార్తీక్ బర్త్‌పుడి స్థానం సంపాదించాడు. ఈనెల 14న హైదరాబాద్ మణికొండలోని తన గురువు వేణుగోపాల్ చేతుల మీదుగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్, బంగారు పతకాన్ని అందుకున్నారు. గత డిసెంబర్ ఒకటిన హాలెల్ మ్యూజిక్ స్కూల్ నిర్వహించిన ఆన్‌లైన్ సంగీత పోటీల్లో ఆయన పాల్గొన్నారు. అరుణ్ కార్తీక్ కీసరలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు.